# తస్మాత్ జాగ్రత్త

ఈ మధ్య అమెరికాలో ఇండియానించి వచ్చిన మనవాళ్ళు, ప్రవర్తిస్తున్న తీరు, వాళ్ళను ప్రమాద పరిస్థితుల్లోకి తీసుకు వెళ్తుంది. అందుకని ఇది ఇండియానించి వస్తున్న మనవాళ్ళకి ఇస్తున్న సమాచారం, ఒక విధంగా హెచ్చరికను.

సెప్టెంబర్ 11 2001న న్యూయార్క్‌లో జరిగిన సంఘవిద్రోహక చర్య వల్ల అమెరికాలో ప్రశాంత జనజీవనానికి అంతరాయమొచ్చింది. ఎన్నిచోట్ల ఎంతగానో సెక్యూరిటీ పెంచినా, ఇంకా ఎన్నెన్ని కట్టుబాటు చర్యలు తీసుకోవటం చేసినా, ప్రజలూ మీడియా ప్రభుత్వాన్ని బాగా విమర్శిస్తున్నారు. మామూలుగా కట్టుబాట్లేమీ లేకుండా స్వేచ్ఛగా స్వతంత్రంగా బ్రతకటం, ప్రభుత్వం తమ జీవితంలోకి అసలు రాకూడదనీ అతిగా అభిమానించే అమెరికన్లు ఈ సెక్యూరిటీ చర్యలు తమను బాధిస్తున్నాయని అంటున్నారు. ఇతరదేశాలతో పోలిస్తే ఒక విధంగా అమెరికాలో టెర్రరిస్టుల బారినించి రక్షించే సెక్యూరిటీ చాల తక్కువ అనే చెప్పాలి.

ఇరాక్ యుద్ధం జరుగుతున్నప్పుడు, ఇంగ్లాండ్ పారిస్ ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయాల్లో, ప్రతి స్థంభం దగ్గరా మెషీన్ గన్ పట్టుకొని నుంచున్న ఆర్మీని చూసేవాళ్ళం. ఏ మనిషి మీద అనుమానం వచ్చినా అక్కడే కాల్చిపారేయమనే అధికారం కూడా ఇచ్చారుట వాళ్ళకి. ఫ్రాన్స్ నించి అమెరికా వచ్చేటప్పుడు, ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో అందరి సామానూ విప్పించి ఒక్కొక్కటే తనిఖీ చేసిగాని లోపలికి రానివ్వలేదు. నేను ఇజ్రాయిల్ వెళ్ళినప్పుడు విమానంలో వచ్చిన ఇద్దరు తెల్ల అమెరికన్లనూ, గంటసేపు ఇంటర్వ్యూ చేసి గాని వాళ్ళ దేశంలోకి అడుగు పెట్టనివ్వలేదు. దేశ సంరక్షణ దృష్ట్యా ఇలా చేస్తున్నాం, సహకరించమని చెప్పిందావిడ

విమానాల్లో దూర ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణీకులు మధ్యమధ్యలో అటూ ఇటూ తిరగటం మామూలే. కానీ ఇప్పుడలా కాదు. లేచిన వెంటనే ఎయిర్ హోస్టెస్ వచ్చి సీటులో కూర్చోమని చెబుతుంది. బాత్‌రూమ్‌లో చాలసేపుంటే, ఎయిర్ హోస్టెస్ తలుపు మీద చేతితో కొట్టినా ఆశ్చర్యపోనక్కరలేదు.

మా ఆఫీసులో ఒక ఇంజనీరు ఆర్మీలో రిజర్వుగా వుంటున్నాడు. వారానికి రెండుసార్లు అతన్ని ఎయిర్‌పోర్ట్‌కి రమ్మని పిలుస్తారు. వాళ్ళు చెప్పిన ప్లేన్‌లో వచ్చిన ఫ్లైటు ఎక్కటం, వెంటనే ఇంకో ప్లేన్‌లో తిరిగిరావటం అతను చేయవలసిన పని. అనుమానాస్పదంగా వున్నవారిని కనిపెట్టివుండటం, ఎయిర్ లైన్ సిబ్బందిని కాపాడటం, అవసరమైతే బలం ఉపయోగించి అనుమానితులని బలహీనుల్ని చేయటం. ఇవికాక ఎఫ్.బి.ఐ., సి.ఐ.ఎ. కూడా, అనుమానం వచ్చిన వాళ్ళందర్నీ వేయి కళ్ళతో చూస్తూనే వుంటారు.

అమెరికాలో ప్రతి ఆఫీసులోనూ కొన్నిచోట్ల కాఫీ పాటీలు వుంటాయి. అక్కడే ఒక డబ్బాలో పంచదార, ఇంకో డబ్బాలో పాలపొడి వుంటాయి. ఆమధ్య ఒక ఆఫీసులో, ఆ కంపెనీ అభివృద్ధికి ఎంతో కారకుడైన సైంటిస్ట్, మిత్రులతో వేళాకో

శానికి ఒక ప్రాక్టికల్ జోక్ వేశాడు. కాఫీపాట్ పక్కనే కాస్త తెల్లపౌడర్ చల్లి, అక్కడ యాంత్రాక్స్‌వుందని చెప్పాడు. అతను చేసిన పని తెలుసుకున్న అధికారులు వెంటనే ఆయన ఉద్యోగం వూడగొట్టి సెక్యూరిటీ వాళ్ళని పిలిచి, బయటికి పంపించారు. ఎంతో ముఖ్యమైన ఆ సైంటిస్ట్‌ని వదులుకోటానికి కూడా ఇష్టపడ్డారు కానీ, అలాటి సరదా జోకులని మాత్రం ఒప్పుకోలేదు. చాల కంపెనీల్లో ఉద్యోగస్థులకి, అలాటి పనులు చేస్తే బయటకు పంపించేస్తామని హెచ్చరికలు కూడా చేశారు.

అలాగే న్యూజెర్సీలో ఒక దాస్‌గారు ఫోన్‌లో తనకి ఎయిర్‌లైన్ టిక్కెట్టు బుక్ చేసుకున్నాడు. ఆయన పేరు స్పెల్లింగ్ చెప్పమంటే, "డి యాజ్ ఇన్ డిస్ట్రక్షన్, ఎ యాజ్ ఇన్ అమెరికా, ఎస్ యాజ్ ఇన్ శామ్" అని చెప్పాడుట. కాసేపట్లో పోలీసులు రావటం, ఆయన్ని అరెస్ట్ చేసి పట్టుకుపోవటం చకాచకా జరిగిపోయింది.

ఈ సంఘటనల వల్ల అమెరికాలో ఇలాటి వాటిని ఎంత సీరియస్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుంది. ఇదేకాదు ఎవరి మీద ఏమాత్రం అనుమానం వచ్చినా, అమెరికన్లలోనే తెల్లవాళ్ళయినా, నల్లవాళ్ళయినా, ఏ రంగులవాళ్ళయినా లేక విదేశీయులెవరైనా సరే, వాళ్ళ వల్ల ఏమీ ప్రమాదం లేదని వంద శాతం రూఢి చేసుకున్న తర్వాతకానీ వాళ్ళని వదిలిపెట్టటంలేదు. ఇందాక చెప్పినట్టు కొంతమంది అభ్యంతరపెట్టినా, మీడియాలో కొన్ని అభ్యంతరాలు వచ్చినా, మిగతాదేశాలు తమ పౌరులని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అధికారులు సరిగ్గా చూడటం లేదని అంటున్నా, ప్రస్తుతం అమెరికాలో దేశరక్షణని మించిన ఇంకొక ధ్యేయం లేదు. దాని కోసం ఎవరెన్ని అన్నా, ఎంత డబ్బు ఖర్చయినా వెనుకాడేది లేదని స్పష్టంగా చెప్పారు కూడాను.

మనమింకా సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం ఎందుకంటే మనం చూడటానికి చాలవరకూ ఆఫ్గనిస్థాన్, పాకిస్థాన్, మిడిల్ ఈస్ట్ వాళ్ళలా వుంటాం. మన పేర్లు వాళ్ళు అనుమానించే పేర్లలాటివి కాకపోయినా వాళ్ళకి బాగా అలవాటయిన పేర్లు మాత్రం కావు. అంతేకాదు చాలమంది అమెరికన్లకి మన పేర్లకీ అరబ్ దేశాల పేర్లకీ తేడాలేలీదు. మనలో చాలమందికి చైనా తైవాన్ సింగపూర్ మలైషియా లాటి దేశాల వాళ్ళ పేర్లూ, రూపురేఖలూ ఒకటిగానే వున్నట్టు అన్నమాట. అందుకని మనల్ని అనుమానించటంలో వెనుకాడరు. దానికి కారణమైన పొగ మనం చూపిస్తే, మన దగ్గర నిప్పు కోసం తప్పకుండా వెదుకుతారు. ఇవన్నీ వ్రాయటానికి ఒక కారణం వుంది. ఈమధ్య ఇండియానించి వచ్చిన సెలబ్రిటీల గురించి రెండు వార్తలు వచ్చాయిక్కడ. ముఖ్యంగా అమెరికాలోని ఇండియన్ పత్రికలలోనూ, ఇంటర్నెట్ లోనూ.ఆ రెండు సంఘటనలూ కొంచెం జాగ్రత్తగావుంటే జరగవలసినవి కావు.

ఒక సంఘటనలో ఇరుక్కుంది ఒక ప్రముఖ ఇండియన్ సినిమా హీరో. తమిళ, తెలుగు సినిమాలలోనేకాక కాసినోకూసినో హిందీ సినిమాల్లో కూడా వేసిన మంచి నటుడు. కెనడానించి కాలిఫోర్నియా వెడుతున్న ఆ నటుడి రూపం, గడ్డం చూసి కుతూహలంతో అడిగారుట ఎయిర్‌లైన్స్ వాళ్ళు, "మీరు ఎక్కడికి వెడుతున్నారు" అని చెప్పాడుట ఈయన. ఎక్కడ వుంటారా వూళ్ళో అని అడిగితే "నాకు తెలీదు" అన్నాడుట. "మిమ్మల్ని అక్కడ ఎవరు రిసీవ్ చేసుకుంటారు" అంటే తెలీద

న్నాడుట. "మీరేం చేస్తుంటారు" అని అడిగితే ముఖానికి రంగు వేసుకుని తిరుగుతాను అని చెప్పాడుట. మిగతా జవాబులు కూడా అలాగే అర్థంపర్థం లేకుండా వుండే సరికి వాళ్ళు అనుమానించి ఈయన్ని పక్కకు పిలిచి, చాలసేపు ఎన్నో ప్రశ్నలు గుచ్చిగుచ్చి అడిగి, కొన్ని గంటల తర్వాత కానీ వదలలేదుట. ఒకవేళ ఆ వివరాలు తెలీకపోయినా ముందుగా తెలుసుకుని ప్రయాణం చేయటం అవసరం. ఏ దేశమెళ్ళినా ముఖ్యంగా అడిగే ప్రశలవి.

ఇలాగే అమెరికాలో ఒక ప్లేన్‌లో న్యూయార్క్‌కి వెడుతున్నారు ఒక వర్తమాన మలయాళ నటి, ఒక పాప్ సింగర్, ఒక మలయాళం మిమిక్రీ కళాకారుడు. ముగ్గురూ తమ చేతుల్లోనించి ఏవో వ్రాసిన కాగితాలు మార్చుకుంటున్నారు. మధ్యమధ్యలో సీట్లు మారుతున్నారు. చాల పెద్దగా మలయాళంలో మాట్లాడుకుంటున్నారు. ఇంతలోనే నెమ్మదిగా రహస్యంలా మాట్లాడుకుంటున్నారు. ఇలా చాలసేపు జరిగింది తతంగం. మనుష్యుల స్వరూపాలు కూడా కొంచెం అనుమానాస్పదంగా వున్నాయి కనుక, పాసింజెర్లకెగాక ఎయిర్‌హోస్టెస్‌లకి కూడా అనుమానం వచ్చింది వాళ్ళెవరో వాళ్ళ ప్లానేమిటో ఏంచేయబోతున్నారో అని. తర్వాత జరిగింది ఈమధ్య అమెరికాలో చాలసార్లు జరిగిన విషయమే. పైలట్ ఇచ్చిన సంకేతంతో రెండు ఫైటర్ విమానాలు వెంటనే వచ్చి, వీళ్ళ విమానానికి పక్కగా ఎగరటం మొదలు పెట్టాయి. న్యూయార్క్ లగార్డియా ఎయిర్‌పోర్టులో దిగగానే సెక్యూరిటీ పోలీసులు వచ్చి వీళ్ళందర్నీ పట్టుకుపోయారు. నాలుగు గంటల పైన వాళ్ళ వివరాలు అన్నీ అడిగి, వాళ్ళు చెప్పిన వాళ్ళకి ఫోన్లు చేసి, ప్రోగ్రాం అరేంజ్ చేయబోతున్న ఆర్గనైజర్లు వచ్చి సంజాయిషీ చెప్పుకున్నాక, అన్నీ సవ్యంగానే వున్నాయని నిర్ధారణ చేసుకుని కానీ వదలలేదు. ఇంత హంగామా జరగవలసిన అవసరం వుందా? దేశ రక్షణ దృష్ట్యా, పౌర రక్షణ దృష్ట్యా ఈమధ్య అమెరికాలో జరిగిన, జరుగుతున్న టెర్రరిస్ట్ సంఘటనల దృష్ట్యా అది అమెరికాలో అవసరమే. మరి అమాయకులైన ఈ కళాకారులని అలా నిర్భదించవచ్చా? దానికి జవాబు కూడా పైన ఇచ్చిందే. వీళ్ళని నిర్బంధించింది నాలుగు గంటలే. మరి అమెరికా ప్రభుత్వానికి ఆ రెండు ఫైటర్ విమానాలు రావటం వల్లా వాళ్ళని అలా నిర్బంధించినందువల్లా అయే ఖర్చెంత? అంత ఖర్చుపెట్టి దేశ రక్షణకు కృషి చేస్తున్నప్పుడు మరి మన కళాకారులు అక్కడ విమానాల్లో ఆడే ఆటలు ఏమిటి? వాళ్ళు కావాలని చేయలేదని మనకితెలుసు. కానీ అలా అనుమానాస్పదంగా ప్రవర్తించినందువల్ల వాళ్ళకే అనవసరపు గుండెదడ, కాలనష్టం, ఒక్కొక్కొప్పుడు అదే ఇంకా విషమంగా పరిణమించే అవకాశం.

కొన్నివేల ప్రాణాలు అప్పుడే పోయాయి కనుక, మళ్ళీ అది జరగకుండా చీమ చిటుక్కుమన్నా జాగ్రత్త తీసుకుంటున్నారు.

కీడెంచి మేలెంచటం అంటే ఇదేనేమో. మనం జాగ్రత్తగా వుంటే, లేనిపోని అనుమానాలూ వుండవు, అనుకోని ఆలస్యాలు జరగవు.

* * *